# వీలునామా

> దబ్బు సంప్రదాయాల్ని సైతం మింగేస్తోంది... మంచిదే ! ఇలా అయినా ఆదర్శాలని వర్ధిల్లనీ..!
>
> \- జయప్రద

"ఇలాంటి సమయంలో మిమ్మల్ని ఇలా సమావేశపర్చడం నాకు గిల్టీగానే వుంది. కానీ..." అని అసంపూర్ణంగా ఆగారు బాలసుబ్రహ్మణ్యం.

ఆ వేసవిలో... ఆ విశాలమైన లివింగ్ హాల్‌లో కూర్చొనున్న ఏడుగురు వ్యక్తులు- చేతుల్లో కాగితం కట్టతో, ఒంటిమీద నల్లకోటుతో చెమటలు కక్కుతున్న లాయర్ బాలసుబ్రహ్మణ్యం వైపు చూశారు.

ఆ ఇల్లు సంపన్న గృహస్థులదే అయినా... సెంట్రల్ ఏ.సీ. పెట్టుకునేంత హైక్లాస్‌ది మాత్రం కాదు. పరాయివాళ్ళను ఏ.సీ. బెడ్‌రూమ్‌లోకి పిలిచే సంప్రదాయమూ కాదు వాళ్ళది. ఆర్థికంగా ఒక మెట్టు ఎక్కువలో, మనస్తత్వపరంగా ఒక మెట్టు తక్కువలో వున్న కుటుంబమది.

ఆ ఇంటి యజమానురాలు చనిపోయి ఆరోజుకు మూడురోజులు!

మరో వారంరోజులు పొడిగించి, పెద్దకర్మ జరిగాక- ఈ సమావేశాన్ని పెట్టుకోవాలనుకున్నాడు బాలసుబ్రహ్మణ్యం. అది చావు గానీ, పెళ్ళి గానీ... ఎవరి గూటికి వాళ్ళు తొందరగా చేరుకోవాలనే తపనలో నిలువునా మునిగిపోయిన రోజులివి. అందుకే క్రితంరోజు చిన్నకర్మ అయిపోగానే- లాయర్ బాలసుబ్రహ్మణ్యం ఆ ఇంటి మనుషుల్ని మర్నాడు వుండమని కోరాడు.

హాయిగా ఇంటికెళ్ళి, వట్టివేళ్ల తడికలు దించుకుని, కూలర్ ఆన్ చేసుకొని, రెస్ట్ తీసుకుందామనుకున్న ఇంటల్లుడికి విసుగ్గా వుంది. మిగతావాళ్ళకి లాయరుగారు తమ నెందుకు ఇలా సమావేశపర్చారోనని ఆసక్తిగానూ, టెన్షన్‌గానూ ఉంది.

వాళ్ళ ఫీలింగ్స్‌ని అర్థంచేసుకున్నాడు బాలసుబ్రహ్మణ్యం.

"జ్యోత్స్నమ్మగారు వీలునామా వ్రాశారు. తను చనిపోయాక మీకు తెలియజేయ మన్నారు!" అన్నాడు నిదానంగా.

'అమ్మ వీలునామా వ్రాసిందా?'

'నాకు చెప్పకుండా ఎప్పుడు వ్రాసిందో అమ్మ..?!'

'అత్తమ్మకు ఏం తెలుసని వీలునామా వ్రాయించింది!?'

'వదినకు ఇంత తెలివితేటలున్నాయా..?!'

'చెప్తే వింటాడా వీడు? 'ఆస్తులు నీ పేరే రాయించుకోరా...' అంటే విన్నాడా? ఇప్పుడు కోడలు ఏమి వ్రాసిందో అందులో?!'

'ఓఁ... ఇందుకా ఈయన వుండమన్నది? ఆ ముక్కేదో ముందే చెప్పచ్చు కదా!'

– వీలునామా వ్రాసినామె కూతురు, కొడుకు, కోడలు, ఆడబిడ్డ, అత్తగారు, అల్లుడు... ఎవరికి వారే మనసులోనే ఆశ్చర్యపోతున్నారు.

నిశ్శబ్దంగా కూర్చొనున్నది ఆమె భర్త ఒక్కడే! అతనికి లాయర్ ఎందుకొచ్చాడో ఆసక్తి లేదు. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయిన ధ్యాసా లేదు. ఆ వీలునామాలో తన భార్య ఏమి వ్రాసిందోననే 'క్యూరియాసిటీ' అసలే లేదు. అతనిలో వున్నదల్లా... ఒకే కోరిక! గతించిపోయిన తన భార్య తిరిగివస్తే బావున్ననే చిక్కటి అత్యాశ!!

'అత్తమ్మ చేతికి 12 జతల బంగారుగాజు లున్నాయి. అన్నీ కూతురికి వ్రాసిందో, ఏమో! రవ్వల కమ్మలు ఎవరికి వ్రాసిందో..?!' కోడలు మనసులోనే వాపోతోంది.

'తల్లి ఆస్తి కూతురికి కూడా వస్తుందని భయపడి, అన్నయ్యకు అంతా వ్రాసిందేమో..?!' కూతురు భయపడ్తోంది.

'అమ్మ తనమీద కోపంతో ఆస్తంతా ఏ అనాథ శరణాలయానికో రాయలేదు కదా! లేకపోతే అసలు వీలునామా ఎందుకు వ్రాయడం?' తన ఊహకు తానే బెదిరాడు కొడుకు.

'ఏ మాట కామాటే చెప్పుకోవాలి. బతుకున్నన్నాళ్లూ తనకి ఏ లోపమూ చేయలేదు వదిన. పోతూ పోతూ తనకి ఏదైనా రాసిందో, లేదో..?' నిట్టూర్చింది ఆడబిడ్డ.

'కోడలు ఎవర్నీ అన్యాయం చేసే పిల్ల కాదు కానీ... ఆస్తి మనవడికీ, మనవరాలికీ వ్రాసేసుంటే– తనూ, తన కొడుకూ వాళ్ళ దయాధర్మాల మీద బతకాలి!' దిగులుపడింది అత్త.

'ఇది, మీ అమ్మగారు రిజిస్టర్ చేసిన వీలునామా! చదవమంటారా?" అన్నాడు బాలసుబ్రహ్మణ్యం– మధుకర్ వైపు చూస్తూ.

"చదవండి!" అన్నారు అందరూ చిన్నగొంతుతో.

అందులో ఏముందోనని అందరూ టెన్షన్ పడుతున్నారు... ఒక్క హర్షవర్ధన్ తప్ప!

అతనికి మాటిమాటికీ భార్య కావాలనిపిస్తోంది. భార్య మాత్రమే కావాలనిపిస్తోంది. అతను మెల్లగా గతంలోకి జారుకున్నాడు.

●

"నేను ఈ రోజో, రేపో, ఎప్పుడో... మిమ్మల్ని అన్యాయం చేసి వెళ్లిపోతాను!"

"అలా అనకు జోత్స్నా!

"నన్నేం చేయమంటారు? నాకు వచ్చింది తగ్గిపోయే జబ్బు కాదు కదా! ఎప్పుడు కాటేసిందో, ఎక్కడ కాటేసిందో తెలీకముందే కేన్సర్ లివర్‌కి పాకిపోయిందని డాక్టర్లు చెప్పారు కదా! మిమ్మల్ని విడిచి నాకు మాత్రం పోవాలనుందా?"

"వద్దు జ్యోత్స్నా! ఇప్పుడా మాటలొద్దు. ఆరోజు వస్తే ఎలాగూ నాకు దుఃఖం తప్పదు."

"నాకు ఇలా మాట్లాడక తప్పడం లేదు. నాకు ఆరోగ్యం బాగున్నంతవరకూ మీరు కాదన్నప్పుడల్లా నేను వూరుకున్నాను. ఇప్పుడు కూడా మిమ్మల్ని సమర్థిస్తే నా అంత తెలివితక్కువ వాళ్ళు ఇంకొకరుండరు. నా పేరున వున్న ప్రాపర్టీస్ మీకు రాసేయాలి."

"నువ్వే లేకపోయాక... అవి నన్ను ఉద్ధరిస్తాయా జ్యోత్స్నా?!"

"ప్లీజ్‌ః... అలా అనకండి! మనిషికి అవి కూడా అవసరమే!"

"నువ్వే లేకపోయాక- ఒట్టు జోత్స్నా... నాకంతా శూన్యమే!"

అలా ఓ ఆడది నిజాయితీగా 'నువ్వు లేకపోతే నాకు బతుకే లేదు'- అని భర్త నోటిద్వారా అన్పించుకోగలడం... అది ఎంత అదృష్టం! ఆ అదృష్టం ఎంతమంది ఆడవాళ్ళకు దక్కుతుంది?!

"ఆ శూన్యాన్ని పూడ్చడానికే నేను ప్రయత్నిస్తున్నది..."

"జ్యోత్స్నా! పాతికేళ్లు కలిసి కాపురం చేశాం. నేనేమిటో నీకింకా తెలీదా? ఈ డబ్బూ, దానివల్ల నాకు ఒరిగే సుఖాలు నువ్వులేని లోటును పూడ్చగలవా?"

"నిజమే... ఒప్పుకుంటాను. మనిషి ఉనికిని డబ్బు పూడ్చలేదు. కానీ, తప్పడం లేదే! నన్నేం చేయమంటారు?"

●

మాటల్లో నిస్సహాయతను, గొంతులో కన్నీళ్లను నింపుకుని, కొన్ని నెలల క్రితం ఆమె నోటిగుండా వచ్చిన ఆ నాలుగు మాటలు ఈ నిమిషాన అతని కళ్ళలో తడిని నిలిపాయి.

పాపం... జ్యోత్స్న! ఎన్ని మార్లు ప్రాధేయపడిందో..!! తన మాట వినున్నా బావుండేది. ఎన్ని అవస్థలు పడిందో... ఈ వీలునామా వ్రాయించడానికి!

లాయర్ బాలసుబ్రహ్మణ్యంగారు కాగితాలు విప్పారు. విప్పుతూ పక్కనే వున్న మధుకర్ వైపు చూస్తూ అన్నాడు-

"అమ్మ ఉత్తరం కూడా వ్రాశారు. మొదట ఉత్తరం చదవనా? వీలునామా చదవనా?"

అక్కడవున్న వ్యక్తులంతా మరోసారి ఆశ్చర్యపోయారు.

'ఉత్తరం కూడా వ్రాసిందా? అందులో ఏం వ్రాసిందో..?!' అందరి ఆంతర్యాలు తప్ప ఎవరి పెదవులూ విడివడలేదు.

"ఉత్తరం చదవండి..." తల్లి గుర్తుకొచ్చిన మధుకర్ తడిగొంతుతో అన్నాడు.

లాయర్ బాలసుబ్రహ్మణ్యం పేపర్స్ తిప్పాడు.

ఆ కాగితాల రెపరెపల శబ్దానికి... పాతికేళ్ల వెనక్కి వెళ్లిపోయాడు... మరలా హర్షవర్ధన్.

●

పుట్టింటివాళ్ళు ఇచ్చిన పొలం కౌలు డబ్బు- ఇంత కట్ట తెచ్చి ఆరోజు జ్యోత్స్న తన చేతిలో పెడితే... ఆశ్చర్యపోయాడు తను.

"ఏమిటిది?"

"అమ్మావాళ్ళు పంపారు."

"ఎందుకు?"

"ఎందుకేమిటి? మనకిచ్చిన పొలంలో వచ్చిన ఆదాయం!"

"ఓ౦... అదా? అయితే నువ్వు ఏదైనా కొనుక్కో!"

ఆరోజు జ్యోత్స్న పకపక నవ్విన శబ్దం... ఈరోజు ఇంకా తన చెవిలో ప్రతిధ్వనిస్తున్నట్టే వుంది.

"భలేవారేం... రెండు లక్షలు! ఈ డబ్బుకు ఏం కొనుక్కోను?"

"ఏదైనా కొనుక్కో!"

పాపం... జ్యోత్స్న- ఆరోజు నొచ్చుకుంది. ఆ రోజేమిటీ? పాతిక సంవత్సరాల దాంపత్య జీవితంలో ఒక మగవాడుగా తను చూపిన 'ఇగో'కి అలా ఎన్నిసార్లు నొచ్చుకుందో... పిచ్చిది! అదేమిటో ఎప్పటికప్పుడే కాదనుకున్నా- తన 'ఇగో' తన భార్యమీద తనకున్న కొండంత ప్రేమని, విశ్వాసాన్ని కూడా దాటిపోయేది. ఆమె డబ్బును తన డబ్బుగా స్వీకరించడానికి ఆ 'ఇగో' ఒప్పుకునేది కాదు.

ఇప్పుడు... ఇప్పుడు ఏ దేవతో వరమిచ్చి, ఏ అద్భుతమో జరిగి, తన జీవిత భాగస్వామి తిరిగి తన ఎదుట ప్రత్యక్షమైతే... ఆ 'ఇగో'నే కాదు- తన ప్రాణాన్నే ఆమె పాదాల ముందు అర్పించుకోవడానికి సిద్ధంగా వున్నాడు తను.

కానీ, అది జరిగే పనా? ఎంత మూర్ఖుడు తను! తన భార్య ఆఖరి కోరికైనా తీర్చాడు కాదు.

●

ఉత్తరం చదవడం ప్రారంభించాడు... లాయర్ బాలసుబ్రహ్మణ్యం-

"ప్రియమైన కుటుంబ సభ్యులకు!

ఈరోజో, రేపో, ఎప్పుడు పోతానో తెలీని నేను- మీకు వ్రాస్తున్న ఆఖరి ఉత్తరం... ఇది నేను పోయాక మీకు అందుతుంది. అప్పుడు మీరు నా గురించి ఏమనుకున్నా నాకు ఇబ్బంది లేదు. ఎందుకంటే... అప్పుడు ప్రాణంలేని నాలో ఎలాంటి స్పందనలూ ఉండవు.

ఈ ఉత్తరంలో ఏ రహస్యమూ లేదు కాబట్టి నా వీలునామాతో పాటు దీన్ని లాయర్ బాలసుబ్రహ్మణ్యంగారు చదువుతారు. విన్న తర్వాత మీ నిర్ణయం లాయర్‌గారికి చెప్పండి.

నా తదనంతరం మీరంతా నా భర్తను బాగా చూస్తారని నాకు నమ్మకం వుంది. కాని, మీరంతా ఆయన్ను ఎంత బాగా చూసినా భార్యాభర్తల మధ్య బంధమే వేరు. అది చాలా విలక్షణమైంది. పరాయివాళ్ళ మధ్య లేని కోపతాపాలు, అలకలు, తగవులు, విడిపోవడాలు, కలవడాలు- ఇలా... ఎన్నో వుంటాయి భార్యాభర్తల మధ్య! కారణం... 'నాది' అనే భావం, 'నా స్వంతం' అనే అందమైన స్వార్థం!

ఇద్దరిలో ఎవరికి అవమానం జరిగినా... ఇంకొకరు తనకు జరిగినట్టేనని భావించే బంధం అది! ఎంతటి రహస్యాన్నైనా మరెవరిముందూ జారదనే విశ్వాసాన్నిచ్చే సంబంధం అది! ఒక్కమాటలో చెప్పాలంటే... ఇద్దరిలో ఎవరికి కష్టం వచ్చినా వారికి మరొకరి ఓదార్పు, ఒకరికోసం మరొకరున్నారనే ధైర్యం- ఇదే 'భార్యాభర్తల బంధం'లో వున్న గొప్పతనం.

జంటలో ఒకరు వెళ్లిపోయాక ప్రేమించే పిల్లలు వుండి కూడా మరొకరు ఒంటరితనం ఫీల్ అవుతున్నారు. ఆ తప్పు పిల్లలది కాదు... జంటలో మిగిలినవాళ్ళకు బిడ్డలే ఓదార్పు కూడా. కాదనను- కానీ...

ఎంత సేపు?

ఎంత కాలం?

ఓ పది నిమిషాలు, అర్ధగంట, లేదా ఒకరోజు! ఇంతకంటే వయసులో ఉన్న పిల్లలు తల్లిదండ్రులతో గడపలేరు. ఇది సృష్టివిరుద్ధం కాదు. ఎందుకంటే... తల్లిదండ్రులు సమకూర్చి పెట్టిన ఆస్తుల పెంపు చాలక, ఇంకా సంపాదించాలనే తపనతో ఎవరి ప్రపంచాన్ని వారు సృష్టించుకుంటున్నారు. అందుకే మిమ్మల్ని సృష్టిధర్మానికి వ్యతిరేకంగా ఉండమని నేను కోరను.

మీ జీవితాల్లోనూ ముందు ముందు అనుభవించాల్సిన బాధలు, విసుగులు చాలా ఉంటాయి. ఇప్పటినుండి మిమ్మల్ని నా భర్తతో ఆ బాధల్ని పంచుకుంటూ, అశాంతిగా గడపమని చెప్పడం అన్యాయం.

అందుకే ఒక నిర్ణయానికి వచ్చాను...

నా ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. ఇంకెంతో కాలం బ్రతకనని తెలిశాక నేను- నా భర్తకు మరలా పెళ్ళి చేయాలనుకున్నాను. నేను పోయాక ఆయన ఒంటరివాడు కాకూడదని, ఆయన్ని మాత్రమే ప్రేమించే భార్యను వెతికిపెట్టాలని చాలా ప్రయత్నించాను.

కానీ, నేను బతికుండగా- నా భర్త ప్రేమను మరొకరు పంచుకోవడాన్ని ఎంత సమాధానపరచుకున్నా నా మనసు ఒప్పుకోలేదు... ఓడిపోయాను. అందుకే ఈ వీలునామాతో పాటు ఈ ఉత్తరమూ వ్రాస్తున్నాను.

ఇంతవరకు నా డొక్కల్లో పెట్టుకుని లాలించుకున్న ఆయన్ని మీరేం చేస్తారో మీ ఇష్టం!

ఈ ఉత్తరం కానీ, నా వీలునామా కాని మిమ్మల్ని నొప్పించి ఉంటే... మీ మనిషినే కదా... ప్రేమతో క్షమించండి.

ఇక ఉంటాను... శాశ్వతంగా ఉంటాను.

ప్రేమతో
మీ
జ్యోత్స్న"

●

అక్కడవున్న ఇద్దరి కళ్ళల్లో తప్ప మిగతావాళ్ళ కళ్ళల్లో కన్నీరు!

ఆ ఇద్దరిలో ఒకరు... హర్షవర్ధన్! అతను ఇంకా గతంలో నుండి తిరిగిరాలేదు.

ఇంకొకరు... ఇంటల్లుడు! అతనికి ఈ ఇంటి మంచిచెడ్డలతో పని లేదు.

"ఇక వీలునామా చదవమంటారా?" సాఫ్ట్‌గా అడిగారు బాలసుబ్రహ్మణ్యంగారు.

"చదవండి..." నీరసంగా అన్నారు స్వాతి, మధుకర్ ఒకేసారి.

ఉత్తరాన్ని పక్కనపెట్టి వీలునామాని అందుకున్నారు... ఆ ఇంటి లాయర్ బాలసుబ్రహ్మణ్యంగారు. ఆ కాగితాల చప్పుడుకు వాస్తవంలోకి వచ్చాడు హర్షవర్ధన్.

"ఏ వయసులో అయితే ప్రతి ఒక్కరికీ 'తోడు' అవసరమో– ఆ వయసులో నా భర్తను ఒంటరిగా వదిలిపెట్టి వెళ్లిపోతున్నాను. నా తర్వాత నాలాగే ఆయన్ని ప్రేమించగలిగే వ్యక్తితో ఆయన పెళ్ళి జరగాలి. ఇది నా ఆశ... ఇది నా ఆఖరి కోరిక కూడా! కనుక ఇంత కాలం ప్రేమించి, నా మాటను గౌరవించిన మా ఆయన పెళ్ళి చేసుకుని తీరాలి.

ఇక, నా పిల్లలు... ఇంతవరకు మా ప్రేమను తాగి పెరిగారు. వాళ్ళు కూడా కృతఘ్నులు కాలేరని నా విశ్వాసం. తల్లిమాటను గౌరవించి, ఆయన వయసులో ఉన్న ఓ ఒంటరి స్త్రీని వెతికి ఆయన పెళ్ళి చేయాలి వాళ్ళు.

అలా వాళ్ళు చేస్తే... నా అనంతరం ఆస్తిని ఐదు భాగాలు చేసి– ఒకటి నా కూతురు అయిన స్వాతికి, ఇంకొకటి నా కొడుకు మధుకర్‌కి, మూడవ భాగం నా స్థానంలో రాబోతున్న ఆ అపరిచితురాలికి, నాలుగో భాగం నా భర్తకు, ఐదో భాగం ఏ అండా లేని నా ఆడబిడ్డ సునీతకు చెందాలని ఈ వీలునామా వ్రాస్తున్నాను.

అలాకాక– నా కొడుకు, కోడలు, మిగతా కుటుంబ సభ్యులు, నా భర్తకు పెళ్ళి చేయని పక్షంలో... ఈ ఆస్తంతా మావారికి, ఆయన తదనంతరం డబ్బు లేక, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్యసహాయం లేక నిస్సహాయంగా చనిపోతున్న హార్ట్ పేషెంట్స్‌కి, వారి 'బైపాస్ సర్జరీ' కోసం వినియోగించాలి.

ఇది పూర్తి ఆరోగ్యంతో, నా పూర్తి సమ్మతితో నేను వ్రాస్తున్న నా వీలునామా.

ఇట్లు
కోకిరాల జ్యోత్స్న"

• • •

ఉత్తరాన్ని, వీలునామాని చదవడం పూర్తిచేసి, కాగితాలు మడుస్తూ... అందరివైపు మార్చి మార్చి చూశాడు బాలసుబ్రహ్మణ్యం.

అందరూ 'డీప్ షాక్'లోకి వెళ్లిపోయారు. వాళ్ళు ఆ షాక్‌లో నుండి తేరుకోవడానికి ట్రైమిస్తూ... మౌనంగా ఉండిపోయారాయన. గంటలు గడుస్తున్నా ఎవరూ మాట్లాడలేదు.

'ఆఁ..! మామ కొత్తపెళ్ళికొడుకైతే తనదేం పోద్ది? ఓ.కే. చేస్తే పోలా?' అనుకుని, 'మిగతావాళ్ళు ఏం చెప్తారో విన్నాక నోరు విప్పచ్చులే..!' అని బయటకెళ్లిపోయారు అల్లుడుగారు.

'తనకు బంగారు గుడ్లు అందించే వదిన స్థానంలో మరొకరా? పోనీలే... వీలునామా ప్రకారం ఐదో వాటా తనదే కదా!' అని సరిపెట్టుకుంది ఆడబిడ్డ.

'తప్పేదేముంది? మామయ్యను కాస్త నిదానంగా ఒప్పించి, పెళ్ళి చేయాల్సిందే!' అనుకుంది కోడలు.

'తలెక్కడ తీసుకెళ్లి పెట్టుకోవాలి?' అని కొంతసేపు వాపోయినా... పిల్లలిద్దరూ తండ్రికి పెళ్ళి చేయడానికి నిశ్చయించుకున్నారు.

అత్తగారికి ఈ పెళ్ళి కొరుకుడు పడకపోయినా... మారిన రోజుల్ని ఒక నిట్టూర్పుతో నిమజ్జనం చేసేసి- 'పోనీలే... కాలాడని వయసులో వచ్చే పిల్ల కళ్ళవుతుంది!' అనుకుని సరిపెట్టుకుంది.

– అలా అందరూ గంటల తరబడి ఆలోచించి, పెళ్ళికి ఒప్పుకున్నారు. వాళ్ళ నిర్ణయం వెనక వున్న స్వార్థాలు, మర్మాలు బాలసుబ్రహ్మణ్యంగారికి అర్థంకాకపోలేదు.

ఏదీ అర్థం కానిది... హర్షవర్ధన్ ఒక్కడికే! అతను వీలునామాలోని మొదటి పేరాగ్రాఫ్ లోని ఆఖరి అక్షరాలతోనే షాక్‌లో కెళ్లాడు.

అతనికి ఆస్తి పంపకాలు వద్దు... కొత్తభార్య రాక వద్దు... తనవాళ్ళ కన్నీళ్లు వద్దు... రాబోయే రోజుల్లో వచ్చే సుఖాలు వద్దు... ఏదీ... ఏదీ... వద్దు!

అతనికి ఇప్పుడు కావాల్సింది... కాస్త ఏకాంతం!...

తన భార్య స్మృతుల్ని నెమరువేసుకోవడానికి గుప్పెడు కాలం!!

●

'ఆంధ్రప్రభ' దినపత్రిక – 'ఏ.వి.కె. ఫౌండేషన్ (అమెరికా)' వారు సంయుక్తంగా నిర్వహించిన
'కథల పోటీ'లో బహుమతి పొంది,
'ఆంధ్రప్రభ' దినపత్రిక 'ఆదివారం అనుబంధం' ... 4 ఫిబ్రవరి' 2007 సంచికలో ప్రచురితమైన కథ